# తిలాపుణ్యం

జయసూర్య





గోధూళి వేళ, గోదావరి ప్రశాంతంగా ప్రవహిస్తోంది. లంకలో మేతకు వెళ్ళిన పాడిగేదెలు ఈదుకుంటూ ఒడ్డు చేరుకుంటున్నాయి. శివాలయంలో గంటలు మ్రోగుతున్నాయి. అప్పుడే నదిలో ఒక లాంచీ దూసుకు వెళ్ళటంతో నీటి జాడ కనపడుతోంది. దగ్గరే వున్న శ్మశానంలోని చితిమంటలు సాయంసంధ్యతో దోబూచులాడుతున్నాయి. అయ్యప్ప భక్తుల స్నానాలతో రేవు సందడిగా వుంది.

''వాడెక్కడికి పోయాడు?'' భుజం పైన వున్న ఉత్తరీయంతో శివాలయం బయట అరుగు దులిపి కూర్చుంటూ అడిగాడు విశ్వనాథం.

''ఏమో! అన్నయ్యా! పొద్దున్ననగా వెళ్ళాడు. తిండీ తిప్పలు లేకుండా తిరుగుతాడు. నాకేం చెప్పడు'' అంది గుడిలో నుంచి బయటకు వస్తున్న సుభద్రమ్మ.

''అదేమిటమ్మా! బాధ్యత తెలీయకుండా తిరిగితే ఎలాగా? స్కూలుకు వెళుతున్నాడా!''

''లేదన్నయ్యా! పదవ తరగతి పరీక్షలకు ముందే మానేశాడు. మేష్టారు యింటికి వచ్చి ఎంతో చెప్పారు. అయినా వింటేగా. యింక నేను స్కూలుకు వెళ్ళను. అన్నాడంతే''

''అంటే చదువుకు గంట వాయించాడన్న మాట. మరి ఏం చేస్తాడట. నిన్నేం చూస్తాడు? వాడెలా బతుకుతాడు?''

''నా మాట అసలు వినడన్నయ్యా! నువ్వే వాణ్ని దారిలో పెట్టాలి. నువ్వంటే భయం వుంది''

''సరే! ఈ రోజుల్లో కుర్రాళ్ళకి భయం, భక్తీ నా! అన్నట్టు వీడికి ఒడుగు అయిందా?''

లేదన్నయ్యా. చేయాలనుకొన్నాం. యింతలోనే ప్రాణం మీదకొచ్చి మంచం పట్టారు. అంతే''

''మాఘమాసం. గుళ్ళో జంధ్యంపోగు వేయిద్దాం''

''అలాగే అన్నయ్యా! నీ యిష్టం'' అంది సుభద్రమ్మ.

గోదావరీ తీరంలో వున్న ఆ ఊళ్ళో వేద పండిత కుటుంబాలున్నాయి. శాస్త్రం, మంత్రం తెలిసిన సంపన్నుల చుట్టూ బతుకు తెరువు కోసం పేద బ్రాహ్మణులు తిరుగుతుంటారు. గుళ్ళూ గోపురాలు, నదీ స్నానాలు, విశేషంగా పూజలు, పునస్కారాలు, నోములు, లక్షవర్తి వ్రతాలు, యింటింట శుభ కార్యాలు పౌరోహిత్య కుటుంబాలకు రోజు గడవటానికి నిత్యపంట. ఇబ్బందులుండవు. అపర కర్మలు చేసే బ్రాహ్మణులు అందరికీ అవసరమే అయినా కొందరి జీవితాలలో పేదరికం తొంగి చూస్తూ వుంటుంది.

సుభద్రమ్మ భర్త పోవటంతో మరింత పేదరాలైంది. గోపాదాల రేవులోని శివాలయాన్ని ఆశ్రయించుకొని రోజులు గడుపుతోంది. గోదావరి నీళ్ళు బిందెలతో తెచ్చి, గర్భాలయం, మంటపం రోజూ శుభ్రం చేయటం ఆమె దినచర్య. ఒక్కడే కొడుకయినా రవిది బాధ్యతలు తెలియని చిన్న వయస్సు. డబ్బుంటే చాలు. రోజూ సైకిలు మీద రాజమండ్రి వెళ్ళి సినిమాలు చూస్తాడు. రెండు మంత్రం ముక్కలు నేర్పుదామని విశ్వనాథంగారు జంధ్యం పోచ వేయించారు. గురువుగారు అంటే భయం వుంది. ఆయన కొట్టేంత హడావిడి చేస్తారు. అప్పుడప్పుడు ఖర్చులకి అందుతున్నాయి. అయినా శ్రద్ధ లేదు. నియమం, నిష్ఠ వున్న విశ్వనాథం శాస్త్రాన్ని తుచ తప్పకుండా అనుసరిస్తాడని మంచి పేరుంది. ఆయనకు తీరిక వుండదు. చుట్టుపక్కల గ్రామాలలో కూడా అపర కర్మలకు ఆయనకే కబురు. శ్రాద్ధ, పితృ కర్మలు, దశాహం కార్యక్రమాలు రాజీపడకుండా పితృదేవతలను తరింపచేస్తారని ఆయనకు మంచిపేరు.

రవి యిప్పుడిప్పుడే గురువుగారి క్రమ శిక్షణకు, సమయ పాలనకు అలవాటు పడుతున్నాడు. అందంగా కళ్ళు, ముక్కు తీరు బావుంటుంది. మంచి రంగు. రోజూ గోదావరి స్నానం. ఈత కొడ్తుంటాడు. రాజమండ్రి సినిమాలకు వెళ్లేటప్పుడు జీన్స్, టీ-షర్ట్ హీరోలా నీట్‌గా వెళ్తాడు. గురువుగారు దానాలకు పిలిస్తే కాళ్ళు దిగని అంగవస్త్రం, చొక్కా, ఉత్తరీయం, నుదుట విభూతి, కుంకుమ చేతితో మాసిన తెల్లసంచీలో దర్భలు. తెల్లారితే, స్నానాలరేవులో దక్షిణాలకు తయారు. శ్రాద్ధ దానాల సందర్భంలో పన్నెండవ రోజు తిలా దానానికి గురువుగారు తననే పిలిపిస్తుంటారు. చేతిలో రూపాయలు ఆడితే చాలు. వేషం మార్చి రాజమండ్రి చెక్కేస్తుంటాడు.

ఆదివారం గోపాదాలరేవులో ఏదో సినిమా అవుట్ డోర్ షూటింగ్. అక్కడ షూటింగ్ తీసిన సినిమా, డెఫినెట్‌గా సక్సెస్ అవుతుందని, శంకరాభరణం రోజుల నుంచి సినిమా వాళ్ళకి నమ్మకం. గోదావరి అందచందాలు, తీరంలోని దేవాలయాలు తరచూ సినిమాలలో సాక్షాత్కరిస్తుంటాయి. శనివారం రాత్రి, రవికి నిద్రపట్టలేదు. తెల్లవారు ఝామున మగత నిద్రలో తన అభిమాన హీరోయిన్ జెనీ, తనతో ఏదో మాట్లాడినట్లు కల. ఎప్పుడు తెల్లారుతుందా? ఎప్పుడు హీరోయిన్ జెనీలియాను చూస్తానా? అని ఒకటే ధ్యాస.

హీరోయిన్ జెనీలియా, గోపాదాలరేవులో అవుట్ డోర్ షూటింగ్‌కు వస్తోందని ఆ నోటా ఈ నోటా తెలిసేటప్పటికి జనంతో ఆ రేవు, గట్టు వరకు కిక్కిరిసిపోయింది. బొమ్మరిల్లు సినిమా ఎన్నిసార్లు చూసాడో! రవికి, జెనీలియా కళ్ళ ముందు కనబడుతోంది. దగ్గరగా వెళ్ళి చూడాలి. నవ్వితే ఎంత అందంగా వుంటుంది? రవికి మనస్సు నిలబడటం లేదు. షూటింగ్ జరుగనున్న ప్రాంతానికి దూరంలోనే జనాన్ని ఆపేసారు. సెక్యూరిటీ గార్డులు, స్థానిక పోలీసులు జనాన్ని అదుపు చేస్తున్నారు.

లాఠీలతో బెదిరించి జనం ముందుకు రాకుండా వెనక్కి, వెనక్కి గెంటుతున్నారు. జనం ఒకళ్ళ నొకళ్ళు తోసుకొంటున్నారు. రవికి ఏం చేయాలో తోచటం లేదు. శివాలయంలో పూజారి శాస్త్రిని బతిమాలుకొని గుళ్ళో దూరాడు. అక్కడా పోలీసులే. ఉదయం నుంచే అవుట్ డోర్ షూటింగ్‌కి సంబంధించిన లైటింగ్స్, కెమెరాలు, నటీనటులు, సహాయకులు హడావిడి ప్రారంభమైంది. యింతలో జెనీలియా రానే వచ్చింది. అందరి కళ్ళు ఆమె వైపే. ప్రొడ్యూసర్, డైరక్టర్ కుర్చీలలో కూర్చుని అసిస్టెంట్స్, కెమెరామెన్‌లను పిలిచి షాట్స్ వివరిస్తున్నారు. రవికి అదో వింతలోకంలో వున్నట్టుంది. ముందుగా హీరోయిన్, స్నాన ఘట్టం మెట్లు దిగటం, గోదావరికి పూజ, పైకి రావటం, శివాలయంలో దర్శనం సీన్స్ షూట్ చేయాలిట. రేవులో రక్షిత వలయంగా బోట్లు ఏర్పాటు చేసారు.

రేవులో మెట్లుదిగి హీరోయిన్ గోదావరికి పూజ లందించే సన్నివేశ చిత్రీకరణకు సన్నాహం ప్రారంభమైంది. హీరోయిన్ నీళ్ళకు దగ్గరలో నిలబడి వుంది. రేవులోకి ఎవ్వరూ రాకుండా పోలీసుల రక్షణ. అటువైపు గోదావరి. అందరినీ గెంటుకుంటూ రవి గుళ్ళోంచి బయటపడి జనం వెనుక నుంచి గోదావరిలో దూకి, రేవువైపు ఈదటం మొదలెట్టాడు. ఎవరో కుర్రాడు గోదావరిలో దూకాడు. జనం అంతా ఆదుర్దాగా అటే చూస్తున్నారు. రేవులో సినిమా వాళ్ళు ఏర్పాటు చేసుకొన్న పడవలను, తప్పించుకొని హీరోయిన్ దగ్గరికి వెళ్ళి చూడాలి. రవికి ఈదలేక ఆయాసం యింకా ఎక్కువవుతోంది. మునిగి మళ్ళీ తేలటం చూస్తున్న ఈతగాళ్ళు మళ్ళీ మునక వేయపోతున్న రవిని బోటులోకి లాగి మెట్ల దగ్గరికి చేర్చారు. నీళ్ళు కక్కించటంతో ఊపిరి అందుకొన్న రవి కళ్ళు తెరిచాడు. హీరోయిన్ ఆత్రుతగా తన వైపే చూస్తోంది. మిమ్మల్ని చూడాలని అన్నాడు అతి ప్రయాసతో. జెనీలియా అతన్ని చూసి నవ్వింది. అందంగా.

★

